సాక్షి
చిత్తూరు
సోమవారం । 30 । జనవరి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	30	20
తిరుపతి	28	21
తిరుమల	25	17
గూడూరు	31	23
నగరి	30	22



ఎడ్ల పందేల జోరు

రామచంద్రాపురం మండలం పీపీపురం గ్రామంలో ఆదివారం ఎడ్ల పందేల జోరు కొనసాగింది. పోట్ల గిత్తలను నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు. - రామచంద్రాపురం

న్యూస్‌రీల్

కనకదుర్గమ్మగా గంగమ్మ


ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆదివారం విజయవాడ కనకదుర్గమ్మ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి గర్భాలయాన్ని వేకువజామునే అర్చకులు శుద్ధి చేశారు. మామిడి, వేపాకు తోరణాలతో ముస్తాబు చేశారు. గంగమ్మతల్లిని విశేషంగా అలంకరించి కొలువుదీర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ


భక్తులతో నిండిన క్యూ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. సుమారు 15వేల మందికి పైగా స్వామివారిని దర్శించుకున్నారు. కంపార్ట్‌మెంట్లతోపాటు, రూ.150, రూ100, ఉచిత క్యూలు నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఏర్పాట్లు చేయించారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, బాలాజీ నాయుడు పర్యవేక్షించారు.

నేడు మూడోవిడత 'చేదోడు'

- 9,477 మంది ఖాతాల్లోకి రూ.9.47 కోట్లు

చిత్తూరు కలెక్టరేట్ : పల్నాడు జిల్లా నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకం కింద మూడో విడత ఆర్థిక సాయం పంపిణీకి సోమవారం శ్రీకారం చుట్టనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. రజకులు టైలర్లు, ఇతర చేతివృత్తుల వారికి విడతల వారీగా ఐదేళ్లలో రూ.50వేలు అందించేలా ప్రభుత్వం జగనన్న చేదోడు పథకం రూపొందించినట్లు వివరించారు. మూడో విడత కింద 9,477 మంది లబ్ధిదారులకు రూ.9.47 కోట్లు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవనున్నట్లు వెల్లడించారు.

మోడల్ పరీక్షకు 250 మంది హాజరు


ప్రశ్నపత్రం ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ మోడల్ ప్రవేశ పరీక్షలకు 250 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో పశ్న పత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరోత్తమ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. త్వరలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాయనున్న విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది.. ఔషధ విలువలున్న ఆహారం తీసుకోవడంపై ఆసక్తి పెరిగింది.. సేంద్రియ విధానంలో సాగు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది.. పాత కాలం పంటలకు ప్రస్తుతం మరింత గిరాకీ వచ్చింది. ఆ క్రమంలోనే తమిళనాడుకు చెందిన అల్లుడు బియ్యం (మాపిళ్లై సాంబ) వరి వంగడం పలమనేరు మండలంలో సాగులోకి వచ్చింది. అత్యున్నత గుణాలున్న ఈ బియ్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఏడు నెలల కాల పరిమితితో చేతికందే ఈ పంట రైతుకు కాసులవర్షం కురిపించే అవకాశముంది. అలాగే పురాతన వంగడాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.


పలమనేరు మండలం కూర్మాయి వద్ద సాగవుతున్న మాపిళ్లై సాంబ వరి (ఇన్‌సెట్) ఏపుగా పెరిగిన వరి కంకి

అల్లుడు బియ్యం అదుర్స్!

- 'మాపిళ్లై సాంబ'లో అద్భుత ఔషధ విలువలు
- తమిళనాడులో పుట్టిన పురాతన వంగడం
- వరి రకాల్లో అత్యంత శ్రేష్ఠమైందిగా గుర్తింపు
- సుమారు ఏడు నెలలు పంట కాలం
- మార్కెట్‌లో కిలో రూ.200 పైమాటే
- పలమనేరు మండలంలో ప్రయోగాత్మకంగా సాగు

పలమనేరు : సాధారణంగా మనం తినే బియ్యం తెలుపు రంగులో ఉంటుంది. వరి పంట కాలం కూడా నాలుగునెలలు మాత్రమే. పంట నాలుగడుగుల దాకా పెరుగుతుంది. కానీ అల్లుడు బియ్యం ఎరుపు రంగులో ఉంటుంది. దీని పంటకాలం ఏడు నెలలు. ఆరు నుంచి ఎనిమిది అడుగులు వరకు పెరుగుతుంది. ఇందులో అద్భుతమైన ఔషధ గుణాలుండడంతో విపరీతంగా డిమాండ్ ఏర్పడింది. గతంలో తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి ప్రాంతంలోని రైతులు శతాబ్దాల నుంచి ప్రకృతి విధానంలో సాగు చేస్తూ వస్తున్నారు. వారు కాపాడుకుంటూ రావడం వల్లే అపురూపమైన మాపిళ్లై సాంబ రకం వంగడాలు నేటి తరానికి అందుబాటులోకి వచ్చాయి. అక్కడి నుంచి విత్తనాలను తీసుకువచ్చి పలమనేరు మండలంలోని కూర్మాయి వద్ద ఓ ఔత్సాహిక రైతు చందూల్ కుమార్ ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు. సేంద్రియ పద్ధతులో పంట పండిస్తున్నారు. ప్రస్తుతం పంట ఏపుగా ఎదిగింది. ఒబ్బిడికి సిద్ధంగా తయారైంది.

వంగడం చరిత్ర ఇదీ..

తమిళనాడుతోపాటు కేరళలోని పలు జిల్లాల్లో సాగు చేస్తున్న పురాతన వరి వంగడమే మాపిళ్లై సాంబ రకం. తమిళంలో మాపిళ్లై అంటే పెళ్లికొడుకు, అల్లుడు అని అర్థం. పాత కాలంలో అల్లుడు దృఢంగా ఉండాలని పెళ్లికుమార్తె ఇంటి వారు ఈ రకం బియ్యాన్ని వండిపెట్టేవారట. నూతన వధూవరులకు ఈ రకం అన్నాన్నే పెట్టడం ఇప్పటికీ కన్యాకుమారి ప్రాంతంలో ఉంది. ఇందులోని ఔషధ విలువల కారణంగా పురుషులకు వీర్యపుష్టి లభిస్తుందని నమ్ముతారు. ఈ బియ్యాన్ని తింటే కాన్పు సాధారణంగా అవుతుందని విశ్వసిస్తారు. అల్లుళ్లకు ప్రత్యేకంగా వడ్డిస్తారు కనుకే ఈ రకం బియ్యాన్ని మాపిళ్లై సాంబ అని పిలుస్తుంటారు. ఏపీ, తెలంగాణాలో అల్లుడు సాంబ, పెళ్లికొడుకు సాంబ, కేరళలో వరణ్‌సాంబ, కర్ణాటకలో వర సాంబ, ఉత్తరాది రాష్ట్రాల్లో దుల్హా సాంబగా పేర్లున్నాయి. ఆన్‌లైన్‌లో ఈ రకం బియ్యానికి బ్రైడ్ గ్రూమ్ రైస్ అని పిలుస్తున్నారు. ఇది రాయలసీమలోని బైరొడ్లును పోలి ఉంటుంది.

పలు సమస్యలకు ఔషధమే!

ఈ రకం కిలో బియ్యంలో ఓ గ్రాము ఫ్యాట్, 80 గ్రాముల కార్బొహైడ్రేట్, 7 గ్రాముల ఫైబర్, 7 గ్రాముల ప్రొటీన్, 50.8 గ్రాముల కాల్షియం, 90.4 గ్రాముల పోషకాలు, 5.47 గ్రాముల ఐరన్ పోషకాలు ఉన్నాయని శాస్త్రీయంగా నిర్ధారించారు. ఈ బియ్యంతో వండిన ఆహారాన్ని భుజిస్తే రక్తశుద్ధి తోపాటు మల బద్ధకం, పైల్స్ సమస్యలు తలెత్తవు. అలాగే మధుమేహం బారిన పడినవారికి కూడా మేలు చేస్తుంది.

రూ.200 పైమాటే..

దుకాణాల్లో ఈ రకం బియ్యం పెద్దగా అందుబాటులో లేదు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి కంపెనీలు కిలో నుంచి మూడు, ఐదు కిలోల బ్యాగుల్లో వీటిని ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. డీమార్ట్, బిగ్ బాస్కెట్ లాంటి మాల్స్‌లోనూ అందుబాటులో ఉన్నాయి. రూ.160 నుంచి రూ.250 దాకా కంపెనీలను బట్టి ధరలున్నాయి.

ప్రయోగాత్మకంగా సాగు

పలమనేరు మండలంలోని కూర్మాయి గ్రామం వద్ద చందూల్‌కుమార్ అనే రైతు తన ఎకరా పొలంలో మాపిళ్లై సాంబ రకాన్ని సాగు చేస్తున్నారు. గత ఏడాది జూలైలో నాటగా, ప్రస్తుతం పంట ఆరు అడుగులకు పైగా పెరిగి ఏపుగా వెన్నుపట్టింది. త్వరలోనే ఒబ్బిడి చేయనున్నారు. ఈ పంటను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల రైతులే కాకుండా కర్ణాటక నుంచి కూడా పలువురు వస్తున్నారు. అల్లుడ బియ్యం సాగు చేసేందుకు పెద్దసంఖ్యలో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.



ఆన్‌లైన్‌లో లభిస్తున్న మాపిళ్లై సాంబ బియ్యం

దేశవాళీ వరి వంగడాల్లో అగ్రస్థానం...

హరిత విప్లవం తర్వాత పలు రకాల హైబ్రిడ్ వరి వంగడాలు సృష్టించబడ్డాయి. సుమారు 2వేల దాకా వంగడాలు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని రాష్ట్రాల్లో మాత్రం దేశవాళీ రకాలు వంశపారంపర్యంగా సాగులో ఉన్నాయి. అందులో అత్యంత పోషకాలు కలిగినవిగా రత్నచోడి, నవారా, కులాకర్, తాజముడి, కుజిపాటియాలా, మైసూర్‌మల్లిగె, చిట్టి ముత్యాలు, బర్మాబ్లాక్, బహురూపి, కుంకుమసార, కాలాబాటి, కోతాంబరి లాంటివి పేరు గడించాయి. అయితే వీటన్నింటికీ మించిన రకంగా మాపిళ్లై సాంబ అగ్రస్థానంలో నిలుస్తుంది. అందుకే మార్కెట్‌లో దీనికంత డిమాండ్ ఏర్పడింది.

అధ్యయనం చేసి సాగు చేశా



కొన్నేళ్ల నుంచి ప్రకృతి సేద్యం చేస్తున్నా. పలు రకాల దేశీయ వరి వంగడాలను సాగు చేస్తున్నా. గతంలో బ్లాక్‌రైస్‌ను సాగు చేశా. కానీ అన్నింటికంటే ఎక్కువ ఔషధ గుణాలున్న మాపిళ్లై సాంబ సాగు చేయాలని నిర్ణయించుకున్న తర్వాత, బాగా అధ్యయనం చేశా. అనంతరం సాగు ప్రారంభించా. ఈ ప్రాంత రైతులకు ఈ వంగడాన్ని పరిచయం చేసి సాగు పెంచాలని భావిస్తున్నా. - చందూల్‌కుమార్, రైతు, కూర్మాయి, పలమనేరు మండలం

అవగాహన పెరుగుతోంది



హైబ్రిడ్ వరి వంగడాల స్థానంలో దేశవాళీ విత్తనాలపై రైతుల్లో అవగాహన పెరిగింది. ముఖ్యంగా సేంద్రియ సేద్యంపై ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. అపురూపమైన మాపిళ్లై సాంబకు (ఏఎపీఎస్ఏఎంబీఏ-1) మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు ఇలాంటి వరి వంగడాలను సాగు చేసేలా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. - సంధ్య, వ్యవసాయాధికారి, పలమనేరు మండలం

మంచి పోషక విలువలు



మన పూర్వీకులు పండించిన ఎన్నో రకాల దేశీవంగడాలు కనుమరుగైయ్యాయి. కానీ కొందరు ఔత్సాహిక రైతులు మళ్లీ వాటిని సాగుచేస్తున్నారు. వీటిలో ఎన్నో రకాల పోషకాలున్నాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువగా ఉండడంతో మలబద్ధకం సమస్య తగ్గుతుంది. అనీమియాతో బాధపడేవారికి ఇది మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గిస్తుంది. - యుగంధర్, మెడికల్ ఆఫీసర్, పలమనేరు

సమపాళ్లలో అభివృద్ధి..సంక్షేమం

- ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో సంతృప్తి
- ప్రగతి పురోగతిపై సంతోషం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


మంగళంపేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు) : రాష్ట్రంలో అభివృద్ధి పనులు.. సంక్షేమ పథకాలను సమపాళ్లలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలో మూడోరోజూ ఆయన పర్యటన కొనసాగించారు. మంత్రి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీకే ప్రజలు అండగా నిలుస్తారన్నారు. పల్లెల్లో పర్యటిస్తుంటే ప్రభుత్వ పథకాలపై జనంలో ఎంత సానుకూలత ఉందో అర్థమవుతోందని వెల్లడించారు. గతంలో సమస్యలు తెలియజేసేందుకు ప్రజలు వచ్చేవారని, ఇప్పుడు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల కింద తమకు అందిన మొత్తాలను మహిళలు వెల్లడిస్తుంటే ఆనందంగా ఉందన్నారు. పేదల పక్షాన నిలిచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రతి ఊరినీ అభివృద్ధి చేశామని వివరించారు. సాగు, తాగు నీటి కోసం ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, త్వరలోనే ఇంటింటికీ కొళాయి ద్వారా పరిశుద్ధ జలం అందించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా పుంగనూరును తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టం చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నా.. మరింత అభివృద్ధితో ముందడుగు వేయాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కోరారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, విరూపాక్షి జయచంద్రారెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి పాల్గొన్నారు.

స్థాయి పెంచేలా ప్రగతి

- విజయవంతంగా గడప గడపకు
- శరవేగంగా అభివృద్ధి పనులు
- స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

సాక్షి, చిత్తూరు : ఉమ్మడి జిల్లా ప్రగతి పథంలో పయనిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయీ సంఘాల సమావేశంలో సీఈఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం విజయవంతంగా సాగుతోందన్నారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులు గుర్తిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు 3,625 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అందులో రూ.107.23 కోట్లతో 328 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన 3,175 పనులకు త్వరలోనే నిధులు మంజూరు చేసి ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు కేటాయించి ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన నిధుల వినియోగంపై శాఖల వారీగా సమీక్షించారు. ఆయా పనులను మార్చి 31వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. 2023-24 అంచనా రాబడి, ఖర్చులపై చర్చించారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రగతి పురోగతిపై ఆయన మాటల్లోనే..

- మొత్తం 1,027 గ్రామ సచివాలయాలకు గాను 558 భవనాలు నిర్మించాం. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.
- 944 రైతుభరోసా కేంద్రాలకు గాను 474 భవనాలు పూర్తిచేశాం.
- 734 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు గాను 203 పూర్తి చేయగా, 486 భవనాలు పురోగతిలో ఉన్నాయి.
- 109 బల్క్ మిల్క్ యూనిట్లుకు గాను 28 పూర్తవగా, 44 పలు దశల్లో ఉన్నాయి.
- 182 వైఎస్సార్ డిజిటల్ గ్రంథాలయాలు నిర్మించనున్నాం.
- జలజీవన్ మిషన్ కింద ఇప్పటి వరకు 7.76లక్షల ఇళ్లకు కొళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నాం.
- ఉపాధి కూలీలకు కనీసం వేతనం రూ.300లకు పెంచాలని కేంద్ర కమిటీకి ప్రతిపాదించాం.
- విలేజ్ హెల్త్‌క్లినిక్ వైద్యసిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికీ నెలకు రెండు పర్యాయాలు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు పరిశీలించేలా చర్యలు చేపట్టాం.
- జగనన్న ఇళ్లను మరింత వేగవంతం చేశాం. ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలు చేపట్టేలా దిశానిర్దేశం చేశాం. ఈ క్రమంలోనే అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించేలా చర్యలు తీసుకున్నాం.
- అర్హులైనవారు ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశాం.
- నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నతంగా మౌలిక వసతులు కల్పించాం.
- ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ఫిర్యాదు పుస్తకం పెట్టేందుకు చర్యలు చేపట్టాం. ఆయా పుస్తకాలను స్థానిక ప్రజాప్రతినిధులు తరచూ పరిశీలించాలని సూచించామని వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ


మహాశివరాత్రి బ్రహ్మోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఈవో సాగర్‌బాబు తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేధా గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆదివారం ఫిబ్రవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఈఓ సాగర్ బాబు ఆవిష్కరించారు. ముందుగా దక్షిణామూర్తి వద్ద ఆహ్వానపత్రికలకు పూజలు నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. 13న కన్నప్ప ధ్వజారోహణం, 14న స్వామివారి ధ్వజారోహణం, 18న మహాశివరాత్రి, 19న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 20న కళ్యాణోత్సవం, 22న గిరిప్రదక్షిణ, 23న ధ్వజావరోహణం, 24న పల్లకీ సేవ, 25న ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకే తొలి ప్రాధ్యానమిస్తున్నట్లు వెల్లడించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడు తూ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

వైభవంగా ఉబ్బదేవర్ల ఊరేగింపు



ఉబ్బదేవర్లను ఊరేగిస్తున్న దృశ్యం

పుంగనూరు : పట్టణంలోని దోబీ కాలనీలో ఆదివారం వైభవంగా ఉబ్బదేవర్ల ఊరేగింపు నిర్వహించారు. పురవీధుల్లో మేళతాళాల నడుమ ఉత్సవం కొనసాగింది.రజక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, రజక సంఘం నేతలు శ్రీనివాసులు, రెడ్డెప్ప, వేణు, నగేష్, హేమంత్ పాల్గొన్నారు.

లారీ బోల్తా..!

చంద్రగిరి: అదుపు తప్పి లారీ బోల్తా పడిన ఘటన తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారి భాకరాపేట కనుమలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, మదనపల్లె నుంచి రేణిగుంటకు గుమ్మడికాయల లోడుతో లారీ పయనమైంది. కనుమలో వస్తున్న క్రమంలో దొనకొండ గంగమ్మ మొదటి మలుపు వద్ద లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవరుకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాదరణతో మళ్లీ గెలిచే సింహమే జగన్





జలజీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే సంజీవయ్య, సమావేశానికి హాజరైన మహిళలు

- ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి

నాయుడుపేటటౌన్ : దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాదరణతో మళ్లీ సీఎంగా గెలిచి, సింహంలా వస్తారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. నాయుడుపేట మండలం పూడేరు గ్రామంలో డిప్యూటీ సీఎంతోపాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య సారథ్యంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను ప్రారంభించారు. పూడేరు గ్రామంలో రూ.36 లక్షల నిధులతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ శుద్ధ తాగునీరు అందించే పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణస్వామి మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఒక్క మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో లక్షలాది కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని చెప్పారు. నవరత్నాల్లో పేదల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యతనిస్తూ అమ్మఒడితోపాటు అన్ని పథకాలు అమలుచేసిన ఘనత సీఎంకు దక్కిందన్నారు. అయితే పప్పు అనే ఓ పిల్లోడు మానసిక స్థితి సరిగా లేక ఏం మాట్లాడుతున్నాడో అతనికే అర్థం కావడంలేదని ఎద్దేవా చేశారు. పాదయాత్ర పేరుతో రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ అసభ్యకరంగా వ్యవహరిస్తున్న టీడీపీ నేతల తీరుపై నారాయణ స్వామి తీవ్రంగా విమర్శించారు. గతంలో టీడీపీ పాలనలో రాష్ట్రం ఎడారిగా మారి దుర్భర పరిస్థితిలో ఉన్న విషయాలను గుర్తుచేశారు. జగనన్న సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచే సమృద్ధిగా వర్షాలు పడుతూ రాష్ట్రం సస్యశ్యామలంగా మారిన విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు పాదయాత్రలో కీడు చోటుచేసుకొని ఎంతో మంది ప్రాణాలు బలిగొన్నారని, అదేవిధంగా ఆయన తనయుడు చేపట్టిన పాదయాత్రలో ఎన్టీఆర్ మనుమడు తారకరత్న చావుబతుకులతో పోరాడుతుంటే ఆయన కోలుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రార్థనలు చేస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు ఉపముఖ్యమంత్రి పదవులు దక్కేలా చేసిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, సూళ్లూరుపేట చెంగాళమ్మ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో సందర్శకుల సందడి



పక్షుల కేంద్రంలో యువకులు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రంలో విడిది చేసే విదేశీ వలస విహంగాలను వీక్షించేందుకు ఆదివారం పలు ప్రాంతాల నుంచి సందర్శకులు విచ్చేశారు. చెన్నై, తిరుపతి, నెల్లూరు, గూడూరు తదితర ప్రాంతాల నుంచి విచ్చేసిన పర్యాటకులు, పక్షి ప్రేమికులు ఉదాయాన్నే కేంద్రానికి వాహనాల్లో విచ్చేసి రోజంతా సరదాగా ఇక్కడే గడిపి పక్షులను తిలకించారు. పర్యావరణ కేంద్రంలోని విహంగాల జీవన శైలి చిత్రాలను పరిశీలించారు. మార్గంమధ్యలో పార్కులోని జింకలను, పంజరంలోని చిలుకలను సందర్శించారు. పిల్లలు పార్కులో ఆటపాటల్లో మునిగి తేలారు. ప్రస్తుతం కేంద్రంలో విహంగాలన్నీ పిల్లలను పొదిగి ఉన్నాయి. పిల్ల విహంగాల అరుపులు, కేరింతలు పక్షి ప్రేమికులను బాగా ఆకట్టుకుంటున్నాయి.



పక్షుల కేంద్రంలో విడిది చేస్తున్న గూడబాతులు

తలకోనలో పర్యాటకులకు మరింత ఆహ్లాదం



అభివృద్ధి పనులను పరిశీలించి, సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా అటవీశాఖాధికారి సతీష్‌రెడ్డి

ఎర్రావారిపాళెం: తలకోనలో పర్యాటకంగా సందర్శకులకు ఆహ్లాదకర, ఆనందకర వాతావరణాన్ని కల్పించనున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం తలకోన జలపాతం, సీబీఈటీని సందర్శించారు. జలపాతం మార్గంలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధిపై ఎఫ్ఆర్‌వో దత్తాత్రేయకు ఆయన దిశానిర్దేశం చేశారు. డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తలకోన ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తామన్నారు. జలపాతం వద్ద సందర్శకులకు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా, సురక్షిత ఏర్పాట్లకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. జలపాత మార్గంలో రైలింగ్(రక్షణగా ఐరన్‌రాడ్‌లు) ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈత కొలను వద్ద గదిని ఆధునీకరించనున్నట్లు చెప్పారు. జలపాతం పైభాగంలోంచి దట్టమైన అటవీ సౌందర్యాన్ని ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించే విధంగా సిద్ధప్పగుహ మార్గాన్ని మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. అందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. ఈత కొలను వద్ద వాగు దాటేందుకు అనువైన వంతెనను ఏర్పాటు, పార్కింగ్, రోడ్డు మరమ్మతులు, సీబీఈటీ వద్ద మరింతగా పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలు పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. తలకోనను సందర్శిస్తున్న పర్యాటకులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించేందుకు అని విధాలా ప్రణాళికలు రూపొందించామన్నారు. అందులో భాగంగానే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభీష్టం మేరకు ఇకో టూరిజంను అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

వేధింపులతో వివాహిత ఆత్మహత్య



మణిమేఘల మృతదేహం

చిత్తూరు అర్బన్: కుటుంబ కలహాలు, వేధింపుల కారణంగా మణిమేఘల (28) అనే వివాహిత శనివారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని శంకరయ్యగుంటకు చెందిన మణిమేఘల, రామ్‌నగర్ కాలనీకి చెందిన మోహన్‌కుమార్‌ను 11 ఏళ్ల క్రితం ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. దాదాపు పదేళ్లుగా ఆమె పుట్టినింటికి కూడా వెళ్లలేదు. మోహన్ కుమార్ మినరల్ వాటర్ పంపిణీ చేసే ఏజెన్సీను నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. ఈ క్రమంలో డబ్బులు తీసుకురావాలని మణిమేఘలను పుట్టింటికి పంపించాడు. ఏళ్ల తర్వాత ఆమె పుట్టినింటికి రావడంతో కుటుంబ సభ్యులు అడిగినంత డబ్బు ఇచ్చి పంపించారు. ఈ విధంగా పలు పర్యాయాలు రూ.లక్షల్లో ముట్టజెప్పారు. అయితే తమ పుట్టింటి వాళ్ల దగ్గర ప్రస్తుతం డబ్బులు లేవని, ఇక ఇబ్బంది పెట్టవద్దని మణిమేఘల భర్తకు చెప్పింది. పట్టించుకోని మోహన్‌కుమార్ డబ్బు తీసుకురావాలని గొడవపడేవాడు. చివరకు కులం పేరుతో కూడా దూషించేవాడని తన చెల్లెలు చెప్పి బాధపడిందని మృతురాలి అన్న మణి ఫిర్యాదులో పేర్కొన్నాడు. డబ్బే కావాలంటే తాను కూడా ఉద్యోగానికి వెళతానని మణిమేఘల చెప్పినా ఆమె భర్త నిరాకరించాడు. దీంతో శనివారం రాత్రి కూడా ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. ఈ క్రమంలో డబ్బులు తెస్తే రా.. లేకుంటే చావు అని మోహన్‌కుమార్ తెగేసి చెప్పడంతో మనస్థాపం చెందిన మణిమేఘల చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఆదివారం ఉదయం తలుపు తట్టినా అలికిడి లేకపోవడంతో మణిమేఘల అన్న మణికి ఫోన్ ద్వారా సమాచారం అందించి మోహన్‌కుమార్ బయటకు వెళ్లిపోయాడు. మణి వచ్చి ఇంటి తలుపు పగులగొట్టి చూడగా మణిమేఘల ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, మణి ఫిర్యాదు మేరకు మోహన్ కుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నివేదికలు నమ్మకండి ప్లీజ్..!

- టీడీపీ పరిస్థితి తీసికట్టే
- లోకేష్ ఎదుట కుండ బద్దలు కొట్టిన తమ్ముడు



సమావేశంలో లోకేష్‌తో మాట్లాడుతున్న టీడీపీ నేత భానుమూర్తి

శాంతిపురం(చిత్తూరు జిల్లా): ''కుప్పంలో మన పార్టీ పుంజుకుంది.. అంతా బావుంది అని చాలామంది నేతలు రిపోర్టులు ఇస్తున్నారు. అలాంటి తప్పుడు నివేదికలు నమ్మకండి ప్లీజ్.. క్షేత్రస్థాయిలో టీడీపీ పరిస్థితి తీసికట్టుగా మారింది సార్'' అని ఓ తెలుగు తమ్ముడు బహిరంగంగానే లోకేష్‌కు విన్నవించారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆదివారం శాంతిపురం మండలం తులసినాయని పల్లె వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో గుడుపల్లె మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి భానుమూర్తి (బాబు) గ్రౌండ్‌లో పార్టీ పరిస్థితిని లోకేష్‌కు వెల్లడించారు. దీంతో ఖంగుతిన్న చినబాబు వెంటనే మైకు తీసుకుని తనకు క్షేత్రస్థాయిలో ఏమీ తెలియదని ఎలా అనుకుంటావని హుంకరించారు. అన్నీ తనకు తెలుసని పార్టీ పరిస్థితి చాలా బావుందని కప్పిపుచ్చేందుకు యత్నించారు. ఈ క్రమంలోనే వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వనితను తీవ్రంగా దుర్భాషలాడారు. కుప్పానికి ఆమె ఏం పీకిందంటూ అసభ్య పదజాలంతో దూషించారు. అనంతరం మళ్లీ మైక్ పట్టుకున్న భానుమూర్తి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక నేతలు తమ అనుయాయులకే పనులు చేసుకున్నారని, బీసీలకు పనిముట్లు అందించే ఆదరణ పథకంలోనూ అవకతవకలకు పాల్పడ్డారని తెగేసి చెప్పారు. దీంతో అసలే ఆశించిన స్పందన లేక ఆందోళన చెందుతున్న టీడీపీ నేతలకు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లు ఉక్కిరిబిక్కిరయ్యారు.

వేడుకగా వేదనారాయణుని కల్యాణోత్సవం





నాగలాపురంలో వేదనారాయణుని కల్యాణోత్సవం, హాజరైన భక్తులు

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదవల్లి సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఆలయంలోని దేవేరుల సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను రాములవారి మండపంలో ఆసీనులు చేశారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు ఆర్జిత కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొత్తం 32 జంటలు ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నట్లు శ్రీ వేదనారాయణ స్వామి సేవాసంఘం అధ్యక్షులు సంపత్ మొదలియార్ తెలిపారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజభట్టాచార్య. టీటీడీ అధికారులు పర్యవేక్షించారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



రవి కుటుంబానికి బాసటగా స్థానికులు



ఆర్థిక సాయం అందిస్తున్న రాంబత్తయ్య

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని గోపాలకృష్ణాపురంలో ఆదివారం రవి, భారతి దంపతుల ఇల్లు అగ్నికి ఆహుతైంది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతోపాటు పక్కనే పాక ఏర్పాటు చేసుకోగా, పాకలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగాయి. సర్పంచ్ వేలాయుధం పుత్తూరు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంటితోపాటు సామగ్రి అన్నీ కాలిపోవడంతో కట్టుబట్టలతో ఆ కుటుంబం నిలబడింది. రూ.95 వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. కూలి పని చేసుకొని జీవించే రవి కుటుంబానికి పుత్తూరు మండల కో–ఆప్షన్ మెంబర్ రాంబత్తయ్య తక్షణ సాయంగా రూ.వెయ్యితో పాటు బియ్యం అందజేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకుంటుందని తెలిపారు.

కల్యాణ వెంకన్న సేవలో యతిరాజ పీఠాధిపతి



స్వామివారిని దర్శించుకుని వస్తున్న శ్రీయదుగిరి యతిరాజ స్వామివారు

చంద్రగిరి : మైసూరు సమీపంలోని శ్రీయదుగిరి యతిరాజ నారాయణ రామానుజ జీయర్ స్వామి 41వ పీఠాధిపతి శ్రీయదుగిరి యతిరాజ స్వామివారు తన శిష్య బృందంతో కలసి ఆదివారం శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకున్న ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి లారీ దగ్ధం



కాలుతున్న గడ్డి, లారీ

కుప్పంరూరల్ : మండలంలోని వసనాడు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం గడ్డి తరలిస్తున్న ఓ లారీ దగ్ధమైంది. వివరాలు.. తమిళనాడులోని తిరువణ్ణామలైకు చెందిన హంసమ్మ అనే మహిళ ఎండుగడ్డిని లారీలో తీసుకువచ్చి కుప్పం పరిసర ప్రాంతాల్లో విక్రయించేది. ఈ క్రమంలో గడ్డిని తీసుకువస్తుండగా విద్యుత్ తీగలు తగలి మంటలు చెలరేగాయి. డ్రైవర్, గడ్డి యజమాని హంసమ్మ వెంటనే లారీ నుంచి బయట పడి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.20వేల విలువైన గడ్డి పూర్తిగా కాలిపోగా, లారీ దాదాపు దగ్ధమైంది. ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావును సన్మానిస్తున్న పన్నీర్‌సెల్వం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విజయవాడ నుంచి విచ్చేసిన ఆయన ప్రభుత్వ డ్రైవర్లు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. డ్రైవర్ల డిమాండ్‌లను పరిష్కరించుకునేందుకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అనంతరం ఆయన్ను స్థానిక నేతలు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం, నాయకులు షణ్ముగం, రోషన్ బాషా, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.